
**ఈ రాజ్యంలో** రాజుగారు పోయి నెల రోజులవుతూంది. ఈ నెల రోజుల లోగా చక్రవర్తి గారు కొంచెం వీలు చూసుకుని మాకో రాజును ఎంపిక చేసి పెడతారని మేమంతా




కలలు కన్నాం. కానీ చక్రవర్తిగారికి తీరిక లేదట! ఆ దేశాల నుంచి వచ్చే రాయబారులతోనూ, ఈ దేశం నుంచి వెళ్ళే దూతలతోనూ ఆయనకు ఒకటే హడావిడిగా ఉంటూంది! అప్పుడప్పుడు కాస్తంత వెసులుబాటు చిక్కుతున్నా కానీ చక్రవర్తిగారికి మటుకు తీరిక ఉండటం లేదు. ఈ వెసులుబాటు ఉన్న కాస్తంతసమయంలోనూ ఆయన ఉత్తర దేశంలో స్వపక్షీయుల కీచులాటలతోనో, మధ్య దేశంలో ప్రతిపక్షీయులతోనో సతమతమవుతూ ఉన్నారట! ఇంకా ఎప్పుడైనా కాస్తంత ఖాళీ ఉంటే—ఉండనే ఉందిగా ఆ వంగరాజ్యం. అక్కడి పాలకుల తలలు తప్పించే ప్రయత్నం నిరంతరం జరగాల్సినదే గదా!

ఇక గత్యంతరం లేకపోయింది. చక్రవర్తిగారే సెల విచ్చేశారు, మీ రాజ్యంలో రాజుగారి ఎన్నిక ఇంక ఏనుగుకే అప్పజెప్పండీ అని.

ఏనుగు...దంతపు టేనుగు కాదు అది. ఐరావతమూ కాదది... బక్క చిక్కిన ఏనుగు అది.

తను మోయలేని బరువు మోస్తున్నట్టుగా ఉంటుంది, ఆ ఏనుగు. నెమ్మదిగా, అతి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ, ఏ క్షణంలో జీవనాన్ని చాలిస్తుందో అర్థం కానంత మందగమనంతో నడుస్తూ ఉంటుంది. ఆ పట్టపు టేనుగుకు ఇప్పుడు దశ తిరిగింది.

తొండంతో పెద్ద పూల మాల పట్టుకుని రోడ్డు మీది కొచ్చింది. అంత పెద్ద పూలమాల ఎవరి మెడలో వేస్తుందా అని అందరూ ఎదురు చూస్తున్న క్షణాలవి! ఆ మాల ఎవరి మెడలో పడితే వారికీ దశ తిరిగినట్లే లెక్క!

ఇంక ఆ మాలాధరుడికి అడ్డూ ఆపూ లేదు. ఈ రాజ్యం అతని సొంతం అవుతుంది. అంత అదృష్టవంతుడు ఎవరున్నారా అని ఏనుగుతో బాటుగా అందరమూ ఎదురు చూస్తున్న క్షణాలవి!

అదిగో వస్తూంది—పట్టపు టేనుగు తొండంలో పూలమాల! అటూ ఇటూ ఊగుతూ—అందరూ అధికారం కోసం తలలు వంచుకుంటున్న క్షణాలవి. ఆత్మగౌరవం చంపేసుకుంటూ మెడలు చాస్తున్న క్షణాలవి!

ఏనుగు మాత్రం ఠీవిగా, నెమ్మదిగా గజగమనం చేస్తూంది.

అందరి కళ్ళూ ఆ ఏనుగు మీద, ఆ ఏనుగు తొండానికి వేళ్ళాడుతున్న పూలమాల మీద, ఆ పూలమాల వెనక ఉన్న అధికారపు సింహాసనపు ఎత్తుల మీద ఉన్నాయి.

ఏనుగు రెండడుగులు వేసి, ముందుకు వెళ్ళి ఆ తరవాత మళ్ళీ మూడడుగులు వెనక్కు వేసి ఆగింది. మరోసారి ఆలోచించి ఆ పూల మాల కాస్తా నా మెడలో వేసేసింది!

ఉలిక్కి పడ్డాను.

పూలమాల నా మెడలోనే పడింది. అంటే, నేనే ఈ రాజ్యానికి ఇంక రాజును!

"జిందాబాద్!" అంటున్నారు ప్రజలు. నాకు మెలకువ వచ్చేసింది. మెడలో పూలమాలను ఒక్కసారి సరి చేసుకున్నాను. రాజఠీవిని తెచ్చుకున్నాను. ఒక అడుగు వేసి, ఏనుగు మీద ఎక్కి కూర్చున్నాను. అధికారం అందగానేచేసిన మొదటి పని అది అధికారం అందించిన ఏనుగు మీద ఎక్కి కూర్చోవటం.

"జిందాబాద్!" అంటున్నారు ప్రజలు. ఒకరి మీద ఒకరు తోసుకుంటూవచ్చేస్తున్నారు. క్రమశిక్షణ లేదు, సరైన జీవన విధానమూ లేదు. నేనెవర్నని ఇలా మీద పడిపోతున్నారు అసహ్యంగా!

ఛీ.. ఛీ..

ఏనుగు కింద, ఏనుగుకు పక్కనే నడుస్తున్న వారిలో ఒకడునాకు అంకుశం అందించాడు. అందుకున్నాను. ఎంత అందంగా ఉందని! అది చేతిలోకి రాగానే ఎంత తృప్తిగా ఉందని!

నే నెక్కిన ఏనుగును ఒక్క పోటు పొడిచాను, ఆ అంకుశంతో!

ఆలాటి అంకుశపు పోట్లెన్ని తిన్నదో ఏనుగు ఏమీ అన్నట్టు తొణకలేదు నాకు. చికాకు కలిగింది నాకు. ఇలాటి అంకుశపు పోట్లు ఎన్ని తింటే ఇది దారిలోకి

వచ్చాను!

ప్రజలంతా ఇంకా నాకు జేజేలు పలుకుతున్నారు.

ఒకరిద్దరు ధైర్యం చేసి నా మెడలో పుష్పమాలలను వేశారు. వేసేది పూల మాలలు కాబట్టి ఊరుకున్నాను. అయినా. పడాల్సిన అసలైన మాల పడ్డాక ఇంక ఇవన్నీ దేనికి?

ముందుగా రాజభవనానికి వెళ్ళి, పట్టాభిషేకం జరిపించుకుని, ఆ తరవాత చూపించాలి నా తడాకా!

దేశంలో దారిద్ర్యం అంతా నేటితో రద్దు!

దేశంలో ప్రజలకు పైసకు పుష్టికరమైన ఆహారం!

నివిచేందుకు నీడ ఉచితం, కట్టేందుకు బట్ట ఉచితం.

కొద్దో గొప్పో సంపాదించుకునేందుకు తలకో తప్పేలా బంగారం ఉచితం. ఇంకా చాలదంటే కుటుంబానికో గేదెను ఇవ్వటమో, కోటను తలా కొంచెం పంచి ఇవ్వటమో చేస్తే సరి అనుకున్నాను నేను ఆ క్షణంలో, ఆ ఏనుగు నెక్కిన సంబరంలో.

పట్టాభిషేకం జరిగి పోయాక తెరిపించి ఖజానా విప్పి చూస్తూంటే అర్థం అయింది ఎంత సంపద ఇక్కడ ఉందో కదా అని? ఇంత సంపదను ఎన్ని తరాల నా పూర్వులు ఎన్ని అవస్థలతో సంపాదించిపెట్టారో కదా అని! ఇంత సంపద ఇప్పుడు నేను ప్రజలకు పంచి ఇవ్వటమా?

మరి నేను ఇంక ఏం అనుభవిస్తానని! ఇంతా చేసి పంచినా తలకో తప్పేలా బంగారంకాదు సరికదా, తలకో వెంట్రుక వాసికూడా రాదు! ఒకరా ఇద్దరా దేశంలో జనాభా! అడుగు తీసి అడుగు వెయ్యాలంటే కోట్ల మంది ఇసుక రేణువుల్లాంటి జనం. ఇంతమందితోనా సంపద పంచుకోవటం! అయినా ఏముందని పంచుకోవటానికి! ఇంకొంత సంపాదిస్తే కానీ... ఆలోచన వచ్చింది.

మరునాడే అధికారపు అంకుశాన్ని మరోసారి ప్రయోగించాను. ప్రజలంతా ఒక పూట దేశం కోసం పాటు పడి తీరాలని శాసనం చేశాను. ప్రజలు శ్రమదానం చేసి నా బొక్కసం నింపి తీరాలని నిర్ణయించాను నేను. నా నిర్ణయాన్ని కాదనేంత ధైర్యం, సాహసం వారి కెక్కడివి?

రోజు రోజుకూ బొక్కసం లోకి డబ్బు వచ్చి పడుతూంది. ఎవరు లెక్క పెడతారు అదంతా! ఎక్కడ ఉంటాయి లెక్కలు! అయినా ఇదంతా దేశ ఖజానాకు వెడితే నాకు ఒరిగిపడేది ఏముంది! అందుకే, బాగా ఆలోచించి, మరో నిర్ణయం తీసుకున్నాను. దేశానికి వచ్చే ఆదాయంలో కొంతభాగం నా స్వంతం అయి తీరాలని! ఇది ప్రజలు అన్యాయం అంటారు అక్రమం అంటారు, అందుకే వారికి ఈ సంగతి చెప్పలేదు.

పక్కవాడు బాగు పడుతూంటే ఓర్వలేని దేశం ఇది! అందుకే ఈ విషయం గోప్యంగా ఉంచాను నేను!

బక్క చిక్కిన ఏనుగు రోజూ నాకు కోటగుమ్మం ముందు దర్శనం ఇచ్చేది. ఆ ఏనుగును చూస్తూంటే జాలి వేసేది కానీ. ఇంత బక్క చిక్కిన ఏనుగుకు ఎంత చేస్తే ఏం లాభం! నేడో రేపో హరాప్ కాక్ అనాల్సిందే ఇది! ఇలాటి దాన్ని గురించి పట్టించుకోని మాత్రం లాభం ఏమిటి! ఆ ఏనుగుగనక గుటుక్కుమంటే ఆ దంతం... నిజమే—అన్నట్లు అదొక్కటి ఇంకా ఉంది ఆ ఏనుగు దగ్గర! ఎలాగైనా దాన్ని స్వంతం చేసుకోవాలి! ఈ బక్క చిక్కిన ఏనుగును ఇలాగే వదిలేస్తే, ఇది కన్ను మూసేందుకు ఎంతో కాలం పడుతుంది: దాని కన్నా...

మంచి ఆలోచన తట్టింది. వెంటనే అంగరక్షకుడిని పిలిచాను. నా ఆలోచనను ఆచరణలో పెట్టమన్నాను.

క్షణం ఆగి అన్నాడు అంగరక్షకుడు: "రాజా అది తరతరాలుగా మనకు విశ్వాసంగా ఉంటున్న జీవి. ఇప్పుడెంతో చిక్కి పోయింది. ఇప్పటికే ఎన్నో తరాల సేవతో, ఎంతో కష్టంతో బతికిన జీవి అది. ఇంకా బరువును మోయలేదేమో అది!"

నేను అది ఆలోచించ లేదనుకున్నాడు కాబోలు! పిచ్చివాడు! కానీ నా ఆలోచన ఎలా చెపుతాను!

అందుకే నవ్వాను నా ఆజ్ఞ పాటించమని చెప్పాను. తల వూపుతూ వెళ్ళిపోయాడు అంగరక్షకుడు. అంచెలంచెలుగా నా ఆజ్ఞ ఆ చివర్న ఉన్న మావటీని చేరింది. మావటీ క్షణం ఆలోచించాడు. కానీ ఏమంటాడు? ఆ బక్క చిక్కిన ఏనుగును బయటకు తీశాడు. నదీతీరాన ఉన్న దుంగల్ని నగరం మధ్యలోకి చేర్చటం ఆ ఏనుగు పని! ఎంత బక్క చిక్కినా ఎవరి కోసం చేస్తుందా పని!

తను చేస్తున్న పని ఎవరి కోసమో, దానివల్ల ఏం లాభమో కూడా తెలీని మూగజీవి అది! అయినా ఎంత మొండిగా ఉందది! తను గుటుక్కుమంటే ఎక్కడ ఆ దంతం నాకు లభిస్తుందోనన్న ఉద్దేశంతోనే కాబోలు, ఆ మొండి ప్రాణం ఇంకా మొండిగానే బతుకుతూంది!



Dazzal

ఎంత ప్రయత్నించినా, ఎన్ని అవస్థలు పడినా ఆ ఏనుగు మాత్రం ఓపికగా జీవనం సాగిస్తూంది.

నాకు మాత్రం ఓపిక చచ్చిపోతూంది. ఎంత కాలం ఇలా? ఈ ఏనుగులో ఇంత ఓపిక ఉన్నా నాలో మాత్రం లేదు. ఎప్పుడు ఆ దంతం నా సొంతం అవుతుందా అనే కోరిక అధికమయి పోయింది.

ఇంక ఉండబట్టలేక పోయాను. అంగరక్షకుడిని పిలిచాను. కొత్త ఆలోచనను చెప్పాను. ఉలికి పడ్డాడు. అయినాసరే, ఆన దాటకుండా నా ఆజ్ఞను ఆ చివర ఉన్న మావటీకి చెప్పాడు. మావటీ పరుగు పరుగున నా దగ్గిరికి వచ్చేశాడు.

"వద్దండి. ఇది మనకు నమ్మినబంటు. పైగా ముసలి ప్రాణం. ఏదో సేవ చేసి బతుకుతూ ఉంది! దాన్నలా ఉండ నీయండి. ముసిల్ది అని అయినా చూడ కుండా మీరు మళ్ళీ దుంగలపని లప్ప జెప్పారు. చేయలేని పనే అయినా, చేత గాని బతుకే అయినా చేస్తూంది. కష్టం అని అనకుండా, నోరెత్తకుండా పడి ఉన్న జీవం అది! దాన్ని పూర్తిగా ఇంకా ఇలా కష్టాల పాలు చేయటం మంచిది కాదు! ఆ మూగ జీవి పెట్టే శాపాలు తమకూ, తమ రాజరికానికీ మంచిది కాదు—ఆలోచించండయ్యా!"

ఆలోచించాను. ఇంకా ఏం ఉందని ఆలోచించాలి? అదే అనేశాను.

మావటీ సరేనని వెళ్ళిపోయాడు. అన్ని ఏర్పాట్లు చేయించమని చెప్పాను అంగరక్షకుడికి. వీడూ సరేనని వెళ్ళి పోయాడు.

కానీ, ఇప్పటి వాళ్ళను నమ్మేలా లేదు ప్రపంచం. ఈ మావటీ, ఆ ఏనుగూ, నా అంగరక్షకుడూ, వీరందరిదీ ఒకే జాతి. చెప్పలేం. వీరంతా కలిసి నన్నూ, నా ప్రయోజనాలనూ దెబ్బ తీస్తారు. వీరి నోటి కంట చూసుకోవటం మంచిది అనిపిం చింది నాకు. అనిపించడమే తడవు వాళ్ళకు అప్పగించిన పనిని పర్యవేక్షిం చేందుకు తరలి వెళ్ళాను.

రాజ వెడలె... ఇక మందీ మార్బలానికీ ఏం కొరత! వరసగా ప్రజలు బారులు తీర్చి నిలిచారు. అటూ ఇటూ రక్షక దళం నాకు రక్షగా, నాకు, ప్రజలకు మధ్య కంచెలుగా, గోడలుగా నిలిచారు. ఠీవిగా కదిలాను. ఊరేగింపు ఉత్సవంగా మారింది. ప్రజల జై జై రావాలు భూ నభోంతరాళాలు నిండుతున్నాయి.

నాకు నవ్వు వచ్చింది—పిచ్చి జనం! ఏం చేశానని వీళ్ళకు! అయినా వీళ్ళ కెందుకు ఇంత పిచ్చి ఆదరం నా మీద! ఎందు కింత పిచ్చి అభిమానం నా మీద!

అయినా నే నేమిటి ఇలా ఆలోచిస్తు న్నాను! వీళ్ళిలా అమాయకులుగా ఉన్నంత కాలమే కదా నా పబ్బం గడిచేది! ఎందుకు మరిచిపోతున్నాను ఈ సంగతి! ఇంత వెర్రివాడిని ఎలా అవుతున్నాను?

నన్ను నేను సంబాళించుకున్నాను మతులు గతులు తప్పి పోకుండా జాగ్రత్త పడ్డాను.

నేను వెళ్ళేసరికి ఇంకా నా పరిజనం తమకు అప్పగించిన పనిని చేపట్టనే లేదు. నేను వెళ్ళిన వెంటనే పని మొద లయింది. పట్టపుటేనుగును మావటీ ఆదరంగా తీసుకొచ్చాడు. ఆ తీసుకుని రావటంలో ఎంత అభిమానం! వీళ్ళలో వీళ్ళకు ఎంత అభిమానం! నిజంగా నేను గనుక రాకుండా ఉంటే వీళ్ళంతా కుమ్మక్కయి నన్ను మోసం చేసేవారు కదూ!

నా జాగ్రత్తకు, ముందు చూపుకు నన్ను నేనే అభినందించుకున్నాను. సింహాసనం మీద ఉన్న వాడిని—అమాత్రం ముందు జాగ్రత్త లేకుంటే ఇంకెందుకు పనికి వస్తాను!

మావటీ మళ్ళీ దగ్గిరికి వచ్చాడు. కళ్ళలో ఆ అభ్యర్థన స్పష్టంగా కనిపి స్తూంది. మాటలతో చెప్పలేని దంతా కళ్ళతో చెపుతున్నాడు.

చెప్పింత రాజును ఇక్కడ ఉండగానే ఇంకా బేరసారాలు ఆడేందుకు వస్తు న్నాడు! ఎంత ధైర్యం! చెప్పిన పనిని చెప్పినట్లు చేసుకుని వెళ్ళే అలవాటు లేని ఈ జనానికి క్రమశిక్షణ నేర్పాలి! 'అనుశాసనికత' అలవాటు చెప్పాలి! అదేదో ఈ మావటితోనే ఆరంభిస్తే సరి అనుకున్నాను.

మావటికి కళ్ళతోనే ఆజ్ఞను అందిం చాను ఇంకోసారి.

రంగం అంతా సిద్ధం అయింది.

తరతరాలుగా దాస్యం చేసిన జాతి ఆ ఏనుగుది. అందుకే తనకు జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోకుండా రంగం మీదకు నడిచింది. నాలో ఏదో పిచ్చి ఆనందం పెల్లుబికి పోతూంది.

ఏనుగు చావదు. తనకు ఉన్న దంతాన్ని ఆ విలువైన దంతాన్ని నాకు ఈ నాడు అందిస్తుంది. అయినాకూడా ఆ తరవాత తన సేవ తను చేసుకుంటూనే పోతుంది. ఇలా ఉండాలి అసలు సేవాతత్పరత అంటే!

రంగం మీదకు చేరిన ఏనుగు క్షణం అక్కడ ఆగింది. ఏదో పర్యాలోకిస్తు న్నట్లు పరిసరా లన్నిటినీ పరికించి చూసింది.

అంతే!

ఏం జరిగిందో తెలీదు. ఏం గ్రహిం చిందో తెలీదు.

ఉన్నట్టుండి ఘీంకరించింది, ఉరుము ఉరిమినట్లు!

అందరి గుండెల్లో ఒక్కసారి భయం పెల్లుబికింది.

ఎందుకిలా జరుగుతూంది! ఈ బక్క ఏనుగుకు ఏం తెలిసిందని! మావటీడు ఎంత ప్రయత్నించినా విదిలించుకుంటూం దేం? అరె...ఏనుగు విడిపించుకుంది. కనీ కనపడని సంకెళ్ళు తెంచేసుకుంది.

మందగమనంతో నడవాల్సిన ఏనుగు మారుతంలా, ప్రచండంలా, తుఫానులా, ప్రళయంలా కదలింది.

ఎందు కిదిలా ప్రవర్తిస్తూంది! మది మెక్కి కొట్టుకోవటం లేదు కదా! నాలో కోటి ప్రశ్నలు! శతకోటి సందే హాలు.

ఆలోచించేందుకు అవకాశం లేక పోయింది.

ఆ పిచ్చి ఏనుగు, ఆ బక్క ప్రాణం ఒక్కఅడుగు వేసింది—ఆబగా, ఆత్రతగా, కోపంగా, క్రోధంగా, బాధగా, బాధ్యతగా. నన్ను తన తొండంతో ఒక్కసారి పైకె త్తింది. హాహాకారం చేశాను.

ప్రజలంతా జై కొడుతున్నారు. నాకో, ఆ బక్క చిక్కిన గజరాజుకో అర్థం కాలేదు నాకు!

ఏనుగు తొండం మధ్య చిక్కి నిలి చాను నేను. అటు బతికి బట్టకడతానో, ఇటు తుక్కు తుక్కు అవుతానో తెలీని స్థితి. సంధి జీవితం. ఆ తొండం మధ్యలో ఉన్న నాకు ఇంకా సింహాసనం కనిపిస్తూంది.

ఏనుగు ఒక్కసారి నన్ను గిరగిర తిప్పింది. తొండాన్ని ఒక్కసారి పైకెత్తి నన్ను గాలిలోకి విసిరింది.

ఆ గాలిలో నేను...

అప్పుడు ఇదే తొండం వేసిన పూల మాలే కదా నన్ను ఈ సింహాసనానికి చేర్చింది! ఆ నాడు అంత ఆదరంగా ఆహ్వానం ఇచ్చి, సింహాసనాన్ని అందించిన ఆ ఏనుగే ఈ రోజున ఇలా నన్ను విసిరి కొడుతూందేం?

నేల వదలిన నాకు జ్ఞానోదయం అయింది. అంతా కలలో—నేను నేలమీద బతికాను. అందుకే ఆదరంతో సింహాసనం అందించింది. నేను అంకుశంతో అధికార మిచ్చిన గజరాజుకే హాని తల పెట్టాను. తప్పుకదూ!

నా తప్పు నాకు తెలిసి వచ్చేసరికి ఆలస్య మవుతున్నట్లు ఉంది. కళ్ళు తిరిగి పోతున్నాయి. నేల మీదకు ఆకాశం లోంచి పడుతున్న నాకు భయంతో ప్రాణాలు పైపైనే పోయాయి. ★


శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కృప పొందిన

# "యోగి యాదవ్"

ఆర్యా !

మీ నిత్య జీవితంలో తీరని సమస్యలను తమయొక్క యోగశక్తిలో జయించేసి మిమ్ములను ఆశ్చర్యచకితులనుగా చేస్తారు.

అనేక ఉన్నత అధికారులు, అభిమానులు "యోగి యాదవ్" విశేష యోగ కృపచే కష్టములు నుండి విముక్తులయినారు.

మీ మనస్సును క్లేశపరచు సమస్యలలో ఒక్క ప్రశ్నను వివరంగా వ్రాసి మీ యింటి విలాసము 90 పైసల తపాలా బిళ్ళలతో ఈ క్రింది విలాస మునకు పంపిన యెడల మీ సమస్యలు తీరు విధమును "యోగి యాదవ్" వివరముగా తెలియజేస్తారు. "యోగి యాదవ్" గారికి పెద్ద పెద్ద అధికారులు పంపిన 'సర్టిఫికెట్లు' (Certificates) యొక్క కాపీ మీకు పంపబడును.

విలాసము : "యోగి యాదవ్"

**57, పళనియప్ప నగర్, మద్రాసు-600 087.**

**N.B. :** మీ ప్రశ్నను అంగ్లములో మాత్రమే వివరంగా వ్రాసి పంపవలయును.

JAI ADS